

# కోరుకున్న భార్య

శ్రీరంగపురానికి కనుచూపు మేరలోనే ఉంటాయి ఎత్తైయిన కొండలు. ఆ గ్రామానికి రావాలనుకున్నవారు, రోడ్డుదిగి ఆరమైలు నడవటానికి అంతగా ఇబ్బందిపడరు కాని, నల్లటి ఆ కొండలమధ్యనుంచి పాముకుబుసంలాగా మెలికలు తిరిగిన [illegible] మీద [illegible]ంటే గుండెనిబ్బరంగల మనిషికికూడా కాస్త బిక్కుబిక్కుమంటూనే ఉంటుంది.

ఆవేళకు అక్కడ బస్సు దిగింది శ్రీకాంత్ ఒక్కడే. దుమ్ము రేపుకుంటూ మూలమలుపు తిరిగి బస్సు కనుమరుగైనతరువాత చుట్టూ ఉన్న పరిసరాలవైపు దృష్టి సారించాడు అతను.

బస్సు స్టేజీకి గుర్తుగాకాబోలు అక్కడ ఒక స్తంభం పాతిఉంది. దానిపైన బోర్డు

*శాశ్వతమైన అనుబంధం కోరేవారు అసత్యాన్ని ఆధారం చేసుకోలేరు. నిజం ఏలాంటి పరిణామాలకు దారితీస్తుందో తెలియదు. అసిదే అని తెలుసుకొన్న తరువాతకూడా అందుకు సిద్ధపడగలవారు ఎందరో ఉండరు.*

## ఆర్. సీతారాంరావు

రంగులు మాసిపోయి అక్షరాలు కనబడటం లేదు. స్టేషికి కుడిప్రక్కనుంచి గ్రామంలోకి రస్తా మొదలవుతుంది. సగం కప్పు లేచిపోయిన పాక రోడ్డుకు ప్రక్కగా ఉంది. దాని ముందర వేపచెట్లు, వాటిక్రింద చదరపు రాళ్లు ఉన్నాయి. ప్రయాణికులు ఎక్కువగా ఆ చెట్ల క్రిందనే కూర్చొని బస్సుకోసం నిరీక్షిస్తుంటారు కాబోలు!

శ్రీకాంత్ చేతిసంచీని ఊపుకుంటూ ఊరిలోకి నడక ప్రారంభించాడు. అతనికి ఆ పరిసరాలేమీ అపరిచితాలేంకావు. అంతమాత్రాన అవన్నీ పూర్తిగా తెలుసనికూడా కాదు. ఎనిమిదేళ్ల క్రిందట ఆ ఊరు ఒకసారి వచ్చాడు. అదైనా అమ్మ బలవంతంమీద — సెకండరీ చదువుకు పట్టణానికి పోయేముందు. అప్పుడు రెండు రోజులే ఇక్కడున్నట్లుగా జ్ఞాపకం అతనికి.

శ్రీకాంత్ నడకతోబాటు ఆలోచిస్తున్నాడు. చిన్నప్పటినుంచి తను మితభాషి. ఇతరులతోటి అంత ఎక్కువగా మాట్లాడటమంటే చెడ్డ చిరాకు. మామయ్య తనను అప్పుడు 'నాలిముచ్చు' అని పరాచికాలు గూడా ఆడేవాడు. "అమ్మాయీ! వీడు పెద్దవుతే అఖండుడు అవుతాడెవ్" అని అమ్మతో అనటం తనకిప్పటికీ జ్ఞాపకమే!

ఇప్పుడు 'అఖండుడు' అయ్యాడా, లేదా అనేది అనుమానాస్పదమైన విషయమే. గ్రాడ్యుయేట్ మాత్రం అయ్యాడు తనిప్పుడు. చదువులో ఎప్పుడూ అంత చురుకైనవాడేం కాదు. కానీ పరీక్షల్లోమాత్రం ఎన్నడూ తప్పలేదు. బొటాబొటి మార్కులతో ఆ యేడు పరీక్ష అయ్యాననిపించేవాడు.

ఎనిమిదేళ్లక్రిందట తను ఆ ఊరికి వచ్చినప్పుడు శైలజకు సరిగ్గా ఎనిమిదేండ్లు. పూలజాకెట్టు తొడుక్కొని, కుచ్చీలుబోసిన పరికిణీతో ముద్దులు మూటగట్టుతూ ఉండేది.

ముసురుకుంటున్న ఆలోచనల బారును తప్పించుకొని వెనక్కు తిరిగిచూసేసరికి శ్రీరంగపురపు కొండలు వెనక్కు నడిచిఉన్నాయి. అప్పటివరకూ తళుకులీనుతున్న సూర్యుడు ఎందుచేతనో అలిగి ఎఱ్ఱబారిపోయి పశ్చిమాన క్రుంగిపోతున్నాడు. ఆయన అలక ఎఱ్ఱదనం తాల్చి చుట్టుప్రక్కలగూడా విరజిమ్ముకుంది. ఆ గ్రామంలోకి అడుగుపెట్టేసరికి సరిగ్గా అరయింది శ్రీకాంత్ రేడియండయల్ వాచీలో. రైతులు పొలాల్లో పనులు ముగించుకొని, చిన్నగా గ్రామానికి చేరుకుంటున్నారు. వారితో పాటు పశువులుగూడా అనుసరించి వస్తున్నాయి.

గ్రామ పొలిమేరల్లో ఒకరిద్దరు మాత్రం ఎగాదిగా శ్రీకాంత్‌వైపు చూశారు. అడ్డంగా ఉన్న పశువులను తప్పించుకొని ఆ యింటి ముందుకు చేరేసరికి కొంచెం ఆలస్యమయింది.

చుట్టపొగ, పశువుల రొచ్చు — పల్లెటూరి వాసన కొట్టింది శ్రీకాంత్‌కు. ఇంటిలోపల మండువాలో దీపంబుడ్డి వెలుగుతున్నది. గొడ్లు మేసే చప్పుడు అక్కడి నిశ్శబ్దానికి అప్పుడప్పుడు అంతరాయం కలిగిస్తున్నది. బయట ఎవరూ ఉన్నట్లుగా అలికిడి లేదు.

సందిగ్ధంలోపడిన శ్రీకాంత్ కాస్సేపు తటపటాయించి, అక్కడే వాల్చి ఉన్న మంచంమీద సంచీపెట్టి మామయ్యను పిలుద్దామనుకునే టంతలో ఎవరివో అడుగుల చప్పుడు వినబడ్డది. "ఎవరూ?" అన్న సన్నని స్వరంకూడా ఆ సవ్వడిలో కలిసిపోయింది.

"నేను...." అని తటపటాయించి, "శ్రీకాంత్‌ను" అని పూర్తిచేశాడు.

"ఓ! బావా!" గిరుక్కున ఆమె ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆమె గాజుల చప్పుడు గాలిలో కలిసిపోయింది.

కాస్సేపయినతరువాత ఆమె చెంబులో నీళ్ళు తీసుకువచ్చి శ్రీకాంత్ ముందుంచింది. అతను ఆమె వైపు ఎగాదిగా చూస్తూ "నువ్వేనా, శైలూ?" అన్నాడు.

సమాధానంగా ఆమె నవ్వింది. బుడ్డిదీపపు గుడ్డివెలుతురులో ఆమె పళ్ళు తెల్లగా మెరిశాయి.

కాళ్ళు కడుక్కోవడం పూర్తి అయినతరువాత ఆమె వెంబడి లోనికి నడిచాడు. అత్తయ్య ఎదురుగా వచ్చింది. ఆమె మొహంమీద వెడల్పాటి బొట్టు మసకవెలుతురులోకూడా కొట్టవచ్చినట్లు కనబడుతున్నది.

"బాగున్నావా, నాయనా?" అడిగింది ఆమె.

"ఆఁ!" అని పొడిగా శ్రీకాంత్ జవాబిచ్చాడు.

"ఇంట్లో అంతా?"

"కులాసా" అన్నాడు శ్రీకాంత్.

అత్తయ్య వంటపనులు పూర్తిచేసుకోవడానికి గాబోలు యింట్లోకి వెళ్లింది. శ్రీకాంత్ పక్కనే ఉన్న శైలజ కాస్త బెరుకుగా ఇంట్లోకి వెళ్ళడానికి ఉద్యుక్తురాలయింది.

శ్రీకాంత్ "శైలూ, ఏం విశేషాలు?" అన్నాడు.

లోనికి వెడుతున్న శైలజ ఆ మాటలో వెనక్కు తిరిగిచూసింది. పొడుగాటి ఆమె జడ ముందుకు పడింది. దాన్ని వెనక్కు వేసుకుంటూ చిన్నగా నవ్వి "నీకు తెలియని సంగతులు ఏముంటాయి, బావా?" అన్నది.

"నాకు తెలియని సంగతులే చెప్పమనే నిన్ను అడుగుతున్నాను."

"ఏం, బావా, అనుకోకుండా యింత హఠాత్తుగా ఆకాశంమీదినుంచి ఊడిపడ్డావు?"

"నిన్ను చూడాలని."

చిరునవ్వును పెదిమలవెనక దాచుకుంటూ శైలజ 'అహో!' అన్నట్లుగా అతన్ని చూసింది.

"నిజమే, శైలూ! నిన్ను చూడాలనే." ఒత్తిపట్టి ఒక్కొక్క పలుకును వదిలాడు శ్రీకాంత్.

"ఎనిమిదేళ్ళనుంచి ఎటుపోయింది ఆ చూడాలనుకోవడం?" శైలు దెప్పినట్లుగా మాట్లాడింది.

శ్రీకాంత్ మాట్లాడలేదు. కొంచెంసేపాగి "లేదు, శైలూ. ఏదీ యీ ఎనిమిదేళ్ళనుంచీ రావాలనుకుంటున్నాను గానీ తీరిక దొరక్క" అన్నాడు.

"నీవు వెలగబెట్టే రాచకార్యాలు ఏమున్నాయి బావా, తీరిక దొరక్కపోవడానికి?" సూటిగా శైలజ అడిగింది.

శ్రీకాంత్ ఆమె మొహంలోకి చూశాడు. అప్పటిదాకా అతనివైపే చూస్తున్న శైలజ చూపులను ప్రక్కలకు మరల్చింది.

చిన్నగా నవ్వుతూ "శైలూ, నిజమే నీవన్నమాట. కానీ, ఏమిటో అప్పుడువద్దామని అని [illegible] వచ్చాను. ఉదయమే బయలుదేరాను" అన్నాడు.

గలగలమని నవ్వింది శైలజ.

"సరేలే బావా! వడం నీ యిష్టం. ఇహ యిక్కడినుంచి నిన్ను తరలించడం మా యిష్టం. ఏం అంతేనా!" అంటూ ఆమె లోనికి పరుగెత్తింది.

శైలు చాలా మారిపోయింది. ఎనిమిదేళ్ల క్రిందట ఏవిధంగా ఉన్నది తనకు సరిగ్గా జ్ఞాపకం లేదుగానీ....యిక్కడికి వచ్చేముందు, శైలును ఇంకోవిధంగా తన హృదయంలో రూపకల్పన చేసుకున్నాడు. కాస్త మాట్లాడటానికి సిగ్గుపడుతుందనుకున్నాడు. మహా అయితే ఏవో రెండు మూడు పొడిమాటలు మాట్లాడి ఊరుకుంటుంది అనుకున్నాడు తను.

కాని, శైలు చక్కగా మాట్లాడింది. ఆశ్చర్యంలో మునిగిపోయాడు తను. ఈమాత్రం సంస్కారం ఇటువంటి కుగ్రామంలో అబ్బితే నిజంగా హర్షించదగ్గ విషయమే మరి.

శ్రీకాంత్ తలెత్తి చూసేసరికి ఎదురుగా మామయ్య కాబోలు చూస్తూ నిలుచున్నాడు. చొక్కా విడుస్తూ "ఎవరది?" అన్నాడు.

"గుర్తుపట్టలేదా, మామయ్యా?"

"ఎవరది? మా శ్రీకాంతం గొంతులా ఉంది." ఆనందం, ఆశ్చర్యం గొంతులో మిళాయించి అన్నాడు మామయ్య.

"అవును, మామయ్యా! శ్రీకాంతాన్నే నేను."

"ఓరి, నాలిముచ్చూ, నీవట్రా! ఏమిటీ? ఎప్పుడూ రాక? ఇదేమిట్రా, కనీసం కార్డుముక్కయిన రాయకుండా ఊడిపడ్డావు?"

"నేను వస్తున్నానని ముందే తెలుపేస్తే నీకు యింత ఆశ్చర్యం ఎట్లా కలుగుతుంది మామయ్యా?" నవ్వుతూ అన్నాడు శ్రీకాంత్.

"అవున్రా! నిజం....నిన్ను జూసి ఎన్నిరోజు లయింది? చాలా మారిపోయావురా నీవు. ఏమిటే లాటిపెట్టుకున్నట్లే యింత ఎత్తయ్యావ్? అరేయ్ నాలి! ముక్కుమీది కోపం యింకా అట్లాగే ఉందా?"

మామయ్య మాటలకు శ్రీకాంత్ నవ్వు కున్నాడు. మామయ్యలో ఆ తొందర పిల్లు పైనబడ్డా యింకా తగ్గలేదు.

ఇద్దరూ భోజనాలు చేసి వాకిట్లో వేసిన పక్కలమీద పిచ్చాపాటీ మాట్లాడుతూ నడుం వాల్చారు. వెన్నెలరాత్రి చాలా ఉల్లాసంగా ఉంది. ఆకాశంలో చందమామ చకచకా పరుగెత్తు తున్నాడు. నక్షత్రాల తళుకు చూడటానికి ఎంతో బాగుంది శ్రీకాంత్‌కు.

మాట్లాడుతూనే మామయ్య నిద్రాదేవి పక్కలోకి జారాడు. శ్రీకాంత్ పైకి చూను కుంటూ ఆలోచిస్తున్నాడు. గాజులచప్పుడయింది. ప్రక్కకు తిరిగి చూశాడు అతను. శైలజ మంచినీళ్ల చెంబు మంచంక్రింద సర్దుతున్నది. ఆమె తలలో తురిమిన తెల్లని మల్లెల సువాసన శ్రీకాంత్‌కు మత్తు కలిగిస్తున్నది.

"నిద్దరపోతున్నావా?" అడిగింది ఆమె.

"లేదు."

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నీ గురించే."

"ఏమని?"

"ఇక్కడికి రాకపూర్వం నీవింత 'పాలిష్డ్ గర్ల్' వని అనుకోలేదు."

"బావుంది! పల్లెటూరి మొద్దుక్రింద జమకట్టావా ఏం?" కిలకిలమంది శైలజ.

ఆమె వైపు మాటిగా చూస్తూ "ఊఁ!" అన్నాడు శ్రీకాంత్. మాటిగా తన కండ్లలోకే చూస్తున్న అతన్ని తట్టుకోలేకపోయింది. కను రెప్పలు బరువుగా వాటించి దృష్టిని మరల్చు కుంది.

"శైలూ!"

అరుగుమీద కూర్చుంటున్న ఆమె వెనక్కు తిరిగి "ఊఁ" అంది.

"ఏమన్నా చదువుకున్నావా?"

"ఎందుకు, బావా?"

"ఊరికే తెలుసుకుందామని—"

"మెట్రిక్‌కు ప్రయివేటుగా కట్టాను"— చీరకొంగు ముడిపెడుతూ అన్నది ఆమె. ఎందుకో ఆమె మొహం పల్లబడింది.

మనసౌలుతురులో ఇది గమనించలేదు అతను. "బావుంది — ఏమిరాని నీకు ఎవరు టీచ్‌చేసి పరీక్షకు కూర్చోపెట్టారబ్బా!" తనలో అను కునే మాటలను బయటకు అనేశాడు.

శైలు మాట్లాడలేదు. కానీ ఈ మాటలు ఆమెకు బాధను కలిగించాయి. తెచ్చిపెట్టు కోలు చిరునవ్వుతో "నీ ఒక్కడివే చదువుకున్న వాడివి అనుకోకు బావా! కుగ్రామం అయినా మా ఊళ్లో ఒకరిద్దరు వ్రాయటం, చదవటం నేర్పినవారు లేకపోలేదు" అంది.

"ఇంకో విధంగా అర్థం చేసుకోకు, శైలూ! ఊరికే తెలుసుకుందామని అడిగాను." క్షమా పణను కోరుతున్నట్లుగా ఉంది అతని స్వరం.

శైలజ లేచి లోనికి వెళ్లిపోయింది.

'తనన్న మాటల్లో అంత బాధపడవలసిన విషయమేమీ లేదే!' అనుకుంటూ శ్రీకాంత్ దిండుమీదికి ఒరిగాడు.

అరుబయట చల్లగాలికి ఉదయం త్వరగానే మెలకువ వచ్చింది శ్రీకాంత్‌కు. అయిదు అయి ఉంటుంది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని శ్రీకారం అరచేతిలో వ్రాసుకుని కండ్ల కద్దు కొని ప్రక్కకు తిరిగి చూశాడు.

చిరునవ్వుతో శైలజ తనవైపు చూస్తు న్నది. ఆమె చేతిలో ముగ్గుబుట్ట ఉంది. సగం పెట్టి ఉన్న ముగ్గు నేలమీద బోసికొడుతున్నది.

"శైలూ, ఎందుకో నవ్వుతున్నావ్." తలకు పెట్టిన మల్లెపూవులాంటి దిండును మోకాళ్ల మీదికి గుంజుకొని చేతులను ఒత్తేపడుతూ అడి గాడు శ్రీకాంత్.

"చదువుకున్నవాడివి. ఇంకా పిచ్చినమ్మకాలు పోలేదా, బావా! శ్రీకారాలు చుట్టి కండ్ల కద్దు కుంటున్నావ్?"

శ్రీకాంత్ మాట్లాడలేదు. కొంచెంసేపాగి ముగ్గుపెట్టుతున్న ఆమెను చూస్తూ, "నీవూ కాస్త కూస్త చదువుకున్నదానివేగా! ముగ్గెం దుకు పెడుతున్నావ్?" అని ఎదురుప్రశ్న వేశాడు.

"నేను పల్లెటూరిదాన్ని. అదీగాక చదువు కున్న ఆడవాళ్లు ముగ్గుపెట్టకూడదని ఎక్కడా వ్రాసిపెట్టలేదు గదా!"

"చదువుకున్న మగవాండ్లు మాత్రం శ్రీకారం కళ్లకద్దుకోగూడదని ఎక్కడా లేదే?" మొహంమీద నవ్వు చిందులాడుతుంటే శ్రీకాంత్ చిలిపిగా అన్నాడు.

"మాటలు నేర్చిన మగవాడివి. నీతో నేను వాదనకు దిగలేను బాబూ!" శైలజ ఇంట్లోకి వెళ్ళుతూ అంది.

ఆమెను ముగ్ధుడై శ్రీకాంత్ చూస్తూ, లేచి నిల్చున్నాడు.

కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత కాఫీ తెచ్చి ఇచ్చింది శైలజ. చప్పరిస్తూ, తన వైపు చూస్తున్న అతన్ని "ఎలా వుంది బావా కాఫీ?" అని అడిగింది.

"బావుంది."

"అంటే?" అనుకున్న జవాబు రాకపోయే సరికి శైలజ అర్థంలేని ప్రశ్న అడిగింది.

గంభీరంగా శ్రీకాంత్ మొహం పెట్టేసి,

"మెట్రిక్‌లో నీకు చెప్పలేదా శైలూ? బావుంది అంటే బావుందనే అర్థం?" అన్నాడు.

విరగబడి నవ్వింది శైలజ.

"భలే బావవు మొత్తానికి నీవు." నవ్వు తున్న ఆమె పెదిమల మధ్యనుంచి మాటలు తొస్సిపోయి స్పష్టంగా రాలేదు.

"బావలను సగమూ, మొత్తాలుగా లెక్క వేస్తారా శైలూ మీ ఊళ్లో?"

నవ్వలేకపోయింది శైలజ. కండ్లలో నీళ్ళు తిరిగాయి. పొట్ట చేతితో పట్టుకొని లోనికి వెళ్లింది. చలాకైన ఆమె వింత రూపాన్ని చూస్తూ శ్రీకాంత్ ఒళ్లు మరిచిపోయి కాఫీ క్రింద ఒలకబోసుకున్నాడు.


శ్రీకాంత్ స్నానం చేసినతరువాత, శైలజ నాలుగయిదు నవలలు తెచ్చి అతని ముందున్న బల్లమీద పడేసింది. అందులో రెండు ఇంగ్లీషువి.

"ఏరుకో బావా! వంటయ్యేవరకూ ఏదన్నా చదువుతూ ఉండు."

"ఈ ఇంగ్లీష్ నవలలు ఎవరివి?" సందే హంగా ఆమె మొహంలోకి చూస్తూ అతను అడిగాడు.

బెరుగ్గా ఆమె "నేను తెప్పించాను, బావా!" అంది.

"ఎవరికి?"



నైరాశ్యం
చిత్రం—డి. వి. ఎస్. శర్మ (తెనాలి)

"నాకే." మొహం పక్కకు త్రిప్పుకొని చరచరా ఇంట్లోకి ఏదో పని ఉన్నదానిలా వెళ్లి పోయింది.

తృప్తిగా నవ్వుకున్నాడు శ్రీకాంత్. అందులో ఒకటి ఏరుకొని ఊసుపోకకు చదువుతున్న సమయంలో బయటినుంచి నడివయస్కుడు ఒకాయన లోనికి ప్రవేశించి "రాఘవరావుగారు ఉన్నారా?" అని అడిగాడు.

"లోపల పూజ చేసుకుంటున్నారు. కూర్చోండి" అని సమాధానమిచ్చి పుస్తకంలో లీనమయ్యాడు శ్రీకాంత్.

ప్రక్కనే ఉన్న కుర్చీమీద అతను కూర్చు న్నాడు. అయిదు నిమిషాలు నిశ్శబ్దం ఆ గదిని రాజ్యమేలుతుంది. అతను పొడిదగ్గు దగ్గి, "క్షమించాలి. మీరెవరో తెలుసుకో వచ్చా?" అని శ్రీకాంత్ వైపు చూశాడు. మర్యాద ఆ కంఠంలో ఉట్టిపడుతున్నది.

"తప్పకుండా. నేను రాఘవరావుగారి మేన ల్లుణ్ణి. పేరు శ్రీకాంత్" అని జవాబిచ్చాడు.

"చాలా సంతోషం, మిమ్మల్ని కలుసుకున్నం దుకు. శైలజ మీగురించి చాలాసార్లు చెప్పింది

వాకు."

తలెత్తి శ్రీకాంత్ మీరెవరు అన్నట్లుగా చూశాడు.

"నేను శైలజకు యింతకుపూర్వం పాఠాలు చెప్పేవాణ్ణి. చెప్పుకోగూడదు కానీ నా ప్రోద్బలంమీదనే రామవరావుగారు ఆ అమ్మాయితో పరీక్షకు గట్టించారు." గట్టిగా నవ్వాడు ఆయన. గారపట్టిన పల్లటి పండ్లు వికృతంగా బయటపడ్డాయి. ఆయన మాట్లాడినప్పుడెల్లా ముక్కుపుటాలు పైకి ఉబ్బుతూ తిరిగి వతుకుతున్నాయి.

"పేరు?" అన్నాడు శ్రీకాంత్.

"దివాకర్రావు అంటారండీ." భుజాలు ఎగురవేసుకుంటూ వినయం ఉట్టిపడేలా జవాబిచ్చాడు అతను.

శ్రీకాంత్ "ఉహూఁ" అన్నట్లుగా చూసి తిరిగి పుస్తకంలో మునిగిపోయాడు.

"చూశారూ, శైలజ చాలా చురుకయిన పిల్ల. చెప్పింది యిట్టే అంటుకుపోయేది ఆ అమ్మాయికి. పిల్లలకు అన్నంలాగా చదువు గూడా జీర్ణంచేసుకొనే శక్తి ఉండాలండీ. అప్పుడు గాని రాణించరు. మా అందరికీ గట్టి నమ్మకం

# కోరుకున్న భార్య

ఆ అమ్మాయి తప్పక పరీక్ష అవుతుందని." దబదబా మాట్లాడి కాస్సేపు విశ్రాంతికోసం గామాలు గాలిని పీల్చుకుంటున్నాడు.

ఇంతలో శ్రీకాంత్ మామయ్య వచ్చాడు.

"ఒరేయ్ కాంతం! వీరు దివాకర్రావుగారని ఈ గ్రామంలో మాస్టరు. అదీగాక యింతకు పూర్వంనుంచీ వీరి కుటుంబంతో మాకు బంధుత్వం గూడా ఉంది. అమ్మాయిచేత పరీక్ష యిప్పించింది వీరే." బలవంతంచేసి చెప్పించినట్లున్నది ఆయన మాట్లాడే వాలకం. పరిచయం చేయటం తన ధర్మంమాదిరి ఆయన తన పని నెరవేర్చుకున్నాడు.

"చెప్పారు, మామయ్యా. చాలా కృతజ్ఞులమండీ మీరు మా శైలును విద్యావంతురాలిగా చేసినందుకు." శ్రీకాంత్ కాస్త మొహమాటంతో ఆయన వైపు తిరిగి యీ మాటలు చెప్పాడు.

"అమ్మాయి చురుకైనదిగాకపోతే మన శ్రమంతా వృథా అయ్యేది సుమండీ" అన్నాడు ఆయన.

శైలజ లోపలినుంచి బయటకు వచ్చింది. "భోజనాలకు లేవండి. వంటకాలు చల్లారిపోతున్నాయి" అంటూ దివాకర్రావును చూసి, "బాబాయ్! మీరుకూడా ఈ పూట యిక్కడే. తెలుసా?" అంది.

"మీ పిన్ని నాకోసం ఎదురుచూస్తుందమ్మా." ఇబ్బందిగా ఆయన మొహంపెడుతూ శైలుతో అన్నాడు.

"అదేం కుదరదు. మా బావతోపాటు మీరు కూడా ఇక్కడ భోంచేసి తీరాల్సిందే." శైలజ కంఠం అధికారంగా మ్రోగింది.

"శైలూ! ఇప్పుడు భోజనానికి ఇంకో పోటీకి నన్ను పొమ్మన్నా నేను పోయేదిలేదు తెలుసా!" శ్రీకాంత్ మాటలకు అందరూ నవ్వారు.

ఆ పూట అక్కడ లేవక తప్పిందికాదు దివాకర్రావుగారికి. భోజనం ఒక ముద్ద ఆ రోజు ఎక్కువగా తిన్నట్లుంది. శ్రీకాంత్‌కు పగటి నిద్ర పట్టేసింది. నిద్రనుంచి లేచేసరికి నాలుగయింది. బయట వేడిగాడ్పులు. నిప్పులు చెరుగుతున్నాడు సూర్యుడు. శ్రీకాంత్‌కు నిద్ర తేలిపోయి, చేసేదేమీలేక ఊరికే కళ్ళు మూసుకొని పండుకున్నాడు.

శైలజ టీ కప్పుతో లోనికి వచ్చింది. అడుగుల చప్పుడు దగ్గరబడటం శ్రీకాంత్ విన్నాడు కానీ కండ్లు తెరవలేదు.

"బావా!" అన్నది శైలజ.

శ్రీకాంత్ పలుకలేదు.

"నిద్రపోతున్నట్లుంది." బయటకు అనేసి పరీక్షించటానికి కామోసు అతనిమీదికి వంగింది.

శ్రీకాంత్ గుండె ఆగిపోయింది. గట్టిగా కండ్లు మూసుకొని ఊపిరి బిగపట్టాడు.

ఎందుకో శైలజకు అప్పుడు శ్రీకాంత్ చాలా బావున్నట్లనిపించింది. బరువుగా ఆమె పైకిలేచి వెనక్కు తిరిగింది కప్పు పట్టుకొని. శైలజ నిట్టూర్పులు శ్రీకాంత్‌కు వేడిగా తగిలాయి.

"శైలూ!" అన్నాడు.

వెళ్ళిపోబోతున్న ఆమె ఉలిక్కిపడింది. ముందరికొచ్చి "నిద్రపోవటం లేదా, బావా?" అనడిగింది.

"ఇప్పుడే లేచాను" అన్నాడు అతను లేచి కూర్చుంటూ.

ఆమె సిగ్గుతో కూరుకుపోయింది. "నీవు నిద్రపోతున్నావనుకున్నాను." కప్పు చేతికిచ్చి నేలను చూస్తూ అంది.

"అవును. అందులో అబద్ధమేముంది?" టీ చప్పరిస్తూ ఆమెతో అన్నాడు. కొంచెం సేపయినతరువాత "శైలూ!" అన్నాడు. ప్రశ్నార్థకంగా చూసింది ఆమె.

"నేనిక్కడకు రావటం నీకు ఆశ్చర్యంగా లేదూ?" అడిగాడు.

"ఆశ్చర్యమేముంది బావా? ఏదో చుట్టపు చూపుగా వచ్చావు." బరువుగా అంది ఆమె.

"అంతేనా?" ఇంకేమీ లేదా అనేది అతని ప్రశ్నలో ధ్వనించింది.

"అంతే అనుకుంటాను."


"కాదు శైలూ! ఇక్కడికి ప్రయాణం కావటంలో నా స్వార్థం కూడా ఉంది."


"ఏమిటది బావా?"

"ఈ ఎనిమిదేండ్లలో నీవెంత మారిపోయావో చూడాలని నా రాకలోని ఉద్దేశ్యం శైలూ! నీవు మారావు. కానీ నేననుకున్న విధంగా కాదు."

"ఈ మార్పు నీకు నచ్చలేదా బావా?", దిగులుగా ధ్వనించింది ఆ కంఠం.

శ్రీకాంత్ మాట్లాడలేదు. అప్రయత్నంగా

ఆమె చేయిపట్టుకొని "నేను ఒకటి అడుగుతాను శైలూ! నీవేమీ అనుకోకుండా ఉంటే, నేను నిన్ను పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు.

శైలజ ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూసి, చూపులు దించుకొని, చేయి మెల్లగా విడిపించుకుంది.

"మాట్లాడవేం శైలూ? నీ కిష్టంలేదా?" శ్రీకాంత్‌లోని ఆత్రుత స్పష్టంగా గోచరిస్తున్నది.

"నీలాగా — నన్నుకూడా ఆలోచించుకో వద్దంటావా బావా?" అందామె.

"తప్పకుండా." తేమ్తూ శ్రీకాంత్ అన్నాడు.

టీ నిండుకున్న కప్పును తీసుకొని ఆమె గదిలోంచి బయటకు నడిచింది.

రెండురోజులున్నాడు అక్కడ శ్రీకాంత్. ఈ రెండు రోజుల్లోనూ శైలజే అతనికి అన్నీ అమర్చింది. ఆమె సంస్కారం, వినేయత, మరుకుదనం అతనికి హాయి అనిపించాయి. శైలజతో గప్పాలు కొడుతూ కాలాన్ని డబ్బుల్లా ఖర్చుపెట్టేశాడు.

బయల్దేరవలసిన రోజున శ్రీకాంత్ మనసులో దిగులుమబ్బులు కమ్ముకున్నాయి. ఏదో ముదువు వెళ్లించుకోవడానికి వచ్చిన అతనికి యిప్పుడు ఈ ఊరిని, ముఖ్యంగా ఊరిలోని శైలజనూ విడిచివెళ్లాలంటే బాధ, కనీసం ముందే జాగ్రత్తపడి రెండురోజులు సెలవు ఎక్కువగా పెట్టుకొని రానందుకు తనమీద కోపమూ కలిగాయి.

ఇక గంటకు శ్రీకాంత్ బయల్దేరుతాడనగా కాఫీ కప్పుతోబాటు, సీలువేసిన కవరును గూడా శైలజ, శ్రీకాంత్ ముందుంచింది.

"బావా! ఈ ఉత్తరం తిరిగ్గా మీ ఊరికి వెళ్లింతరువాత చదువుకో. ఏం?" నవ్వుతూ అందామె.

"అలాగే" అంటూ శ్రీకాంత్ దాన్ని జేబులో ఉంచుకొని "మరి నేనడిగిన విషయం?" అన్నాడు.

శైలజ నవ్వింది. శ్రీకాంత్ హృదయంలో మల్లెలు విరిశాయి. ఆమెకు తగినంత దగ్గరగా జరిగి "చెప్పవూ" అని కండ్లలోకి చూశాడు.

"ఏమో బాబూ! నాకు సిగ్గు. అందులో ఉంది" అని కవరువైపు చూపిస్తూ శైలజ తుర్రుమంది.

ఆమె వెళ్లిన వైపు చూస్తూ శ్రీకాంత్ హాయిగా నిట్టూర్చాడు.

శ్రీరంగపురాన్ని వదిలి, శ్రీకాంత్ బస్సుమీద ఉద్యోగంచేసే ఊరికి చేరేసరికి సరిగ్గా ఆరు గంటలయింది.

హొటల్‌కు వెళ్లి భోజనం కానిచ్చి గదికి వచ్చినతరువాత, టేబిల్‌లైట్ వేసుకొని తిరిగ్గా తండ్రికి ఉత్తరం వ్రాయటం మొదలుపెట్టాడు — తేలికయిన మనస్సుతో.

"నాన్నా!

పది రోజుల క్రిందట మీరు వ్రాసిన జాబు అందింది. మీరు వ్రాసినప్రకారం శ్రీరంగపురం వెళ్లివచ్చాను.

శైలజను చేసుకోవాలని వ్రాసినప్పుడు నేను మొదట కొంత సందేహించినమాట నిజమే! ఇష్టంలేకగాదు — కుగ్రామంలో ఉన్న ఆమె తెలివి తేటలకు నేను మొదట విలువ తక్కువకట్టాను. పల్లెటూరిదానిగా జమకట్టినమాటా వాస్తవమే!

నా కోరిక మీకు తెలుసుగా? కొద్దిపాటి విద్యావంతురాలిని చేసుకోవాలని నా అభిమతం. కనీసం ఉత్తరానికి జవాబిచ్చేటట్లుగానైనా ఉండాలి నాకు కాబోయే భార్య.

విద్యావంతులమయ్యామనే గర్వంతో అతి సంస్కారం చూపిస్తూ ఎబ్బెట్టుగా ప్రవర్తించే అమ్మాయిలంటే నాకు పరమ అసహ్యం. నేన రికం చేసుకోవాలనే మీ పట్టుదలను నేను త్రోసిపుచ్చానన్న అపవాదు ఇక నాకు రాదు. శైలజ నాకు నచ్చింది. లగ్నం మీ వీలును చూసుకొని పెట్టించండి. అమ్మకు నా నమస్కారాలు.

ఇంకో విషయం మీకు తెలియనిది: శైలజ ప్రయివేటుగా మెట్రిక్‌కు కూర్చుందట.

కుమారుడు,
శ్రీకాంత్."

వ్రాసిన ఉత్తరాన్ని తృప్తిగా రెండుసార్లు చదువుకొని, చొక్కా తగిలించుకొని ప్రక్క బజారులో ఉన్న పోస్టాఫీసులో పదిలంగా డబ్బాలోకి జారవిడిచి గదికి వచ్చాడు. తేలికగా నిట్టూర్చి పరుపుమీద వాలాడు జేబులో ఏదో ఉన్నట్లు తగిలింది. అది శైలజ యిచ్చిన ఉత్తరం. ఆత్రంగా తీసి చదవటం మొదలెట్టాడు.

"బావా!

నీవు మా ఊరు వచ్చినందుకు నాకు చాలా ఆనందం కలిగింది. నేను కలలోగూడా ఊహించలేదు నీవు వస్తావని.

ఈ ఎనిమిదేండ్లలో మొదటిసారిగా నిన్ను చూడటం మొన్న మా ఊరు వచ్చినప్పుడే. ఇంతకుముందు నిన్ను గురించి అంత ఎక్కువగా ఆలోచించని నా మనసులో, నీ దర్శనమయిన తరువాత ఎప్పుడూ నీ గురించిన ఆలోచనలే. నవ్వకు బావా, నా బలహీనతకు.

నీ రాకకుపూర్వం రెండురోజుల క్రిందట మీ నాన్న—అంటే మా మామయ్య —ఉత్తరం వ్రాశాడు. అందులో నీవు వస్తున్నావని, ఎట్లాగైనా నేను చదువుకున్న దానిగా నీ మనసుకొప్పేలా చేయమని.....

తెలుసుగా పెద్దవాళ్ల ఆలోచనలు? వాళ్లకు నీవు నన్ను తప్ప యింకొకళ్లను వివాహమాడటం ఇష్టంలేదు. చదువుకునే అమ్మాయిని చేసుకోవాలని నీ ఉద్దేశ్యంగా ఇంతకుముందే మాకు చూచాయగా తెలిసింది. వాళ్ల ఊహలు కేవలం అపోహలుగా నేను భావిస్తున్నాను. మీ నాన్నకు కూడా నీమీద అదే అనుమానం. అందుకే ఆయనకంత తొందర. జ్ఞాపకముందా దివాకరావు నీతోకలిసి భోజనం చేశాడు ఆ రోజున— మా మాష్టరు? ఆయన మీ నాన్న పంపించిన మనిషే. నాకు మాష్టరూగాదు, పైగా నన్ను ఆయన పరీక్షకూ కూచోపెట్టనూలేదు. నీకు కోపం వస్తుందేమో ఇంకో విషయం చెబితే— నేనసలు మెట్రిక్ పరీక్షకే కూచోలేదు.



చిత్రకారిణి

చిత్రం—ఎమ్. శంకర్రావు (అనకాపల్లి)

బావా! ఈ నాటకంలో సూత్రధారి మీ నాన్న. పాత్రధారులం నేనూ, మా నాన్నా, దివాకర్రావు పంతులుగారూ. నిన్ను మభ్యపెట్టాం గదూ? ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు బావా! నీ కిష్టం లేకపోతే నన్ను వివాహమాడటం మానేసెయ్యొచ్చు. అది (నిన్ను మభ్యపెట్టడం) నా కిష్టం లేకనే ఈ ఉత్తరం వ్రాశాను. నిన్ను పెండ్లిచేసుకున్నతరువాత నిష్కల్మషమైన నీ కండ్లలోకి చూస్తూ, ఇప్పటి ఈ అబద్ధాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ సుఖమయ జీవితాన్ని గడపలేను. హాయిగా నీతోపాటు సమానంగా కష్టసుఖాలు పంచుకుంటూ సాఫీగా నడిచిపోయే జీవితనౌకలో నీతోపాటు సహచారిణిగా ఉండి ప్రయాణం చేయటం నాకెంతో ఇష్టం బావా!

నీవు వచ్చి నాలో నిద్రిస్తున్న ఆశలను మేల్కొల్పావు. నీ సమక్షంలో గడిపిన ఆ రెండు రోజులూ నా జీవితంలో ఎంతో విలువయినవి, మరిచిపోలేనివి.

నిన్ను ఒకమాట సూటిగా అడుగనా, బావా? నిన్ను పెండ్లిచేసుకునే అర్హత నాకు లేదంటావా, బావా? నాకున్న ఈ కొద్దిపాటి సంస్కారం, ఉత్తరానికి సరిపోయేటన్ని మాటలు వ్రాయడం వచ్చిన విద్యా చాలదా బావా, నీ కాబోయే భార్యకు?

నీవు ఆ రోజున అడిగావుగా, 'నన్ను పెండ్లి చేసుకుంటావా?' అని. నీ కభ్యంతరం లేకపోతే నీ పాదసేవ చేయటానికి నేనెప్పుడూ సంసిద్ధురాలినే బావా!

మౌనం చేసినందుకు క్షమించు.

నీ
శైలు."

"హా! శైలూ! నే నోడిపోయాను" అని గట్టిగా కేకేసి శ్రీకాంత్ పరుపుమీదికి ఒర్గి తృప్తిగా కళ్ళు మూసుకొని శైలజనుగూర్చిన ఊహలలో కరిగిపోసాగాడు. ★